క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి అన్నపురెడ్డి వాసుదేవరెడ్డి కోరారు. మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు మండలాలకు సోషల్ మీడియా ప్రతినిధులను నియమించినట్లు ఆయన తెలిపారు. పట్టణ కన్వీనర్‌గా కె.సందీప్, కో కన్వీనర్లుగా ఎల్లకర రంగ, ఎస్‌కే జావీద్‌బాషా, సీహెచ్ దినేష్, నాలి రజని, మండల కన్వీనర్‌గా కొలగట్ల శివారెడ్డి, కో కన్వీనర్లుగా జి.చెన్నారెడ్డి, ఎల్.శేఖర్, కె.అల్లూరయ్య యాదవ్, పి. కొండారెడ్డిలను నియమించారు. తర్లుపాడు మండల కన్వీనర్‌గా నూనె ఇంద్రసేనారెడ్డి, కో కన్వీనర్లుగా తారకసాయి, ఇండ్ల దాసు, పి.రామయ్య, కృష్ణయాదవ్‌లను నియమించినట్లు వాసుదేవరెడ్డి వివరించారు.

రైల్వే సేవలు విస్తృతం చేయాలి

గిద్దలూరు రూరల్: రైల్వే సేవలను మరింత విస్తృతం చేయాలని కోరుతూ బీజేపీ నాయకుడు మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లోని స్టేషన్ అధికారికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. నంద్యాల నుంచి కర్నూలు, కడపకు నడుస్తున్న రైలును గిద్దలూరు వరకు పొడిగించాలని, తెనాలి నుంచి మార్కాపురం వరకు వస్తున్న రైలును గిద్దలూరు వరకు పొడిగించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యాదవ సమావేశాన్ని జయప్రదం చేయాలి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎస్.ఎస్ ప్లాజాలో ఈ నెల 15వ తేదీ నిర్వహించనున్న యాదవ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పెట్టిల నారాయణయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశానికి బీసీ యూత్ ఐకాన్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర యూత్ లీడర్ బోడా రామచంద్రయాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీబీసీ జేఏసీ చైర్మన్ అన్నా రామచంద్రయాదవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ ఆవుల నరసింహారావు హాజరవుతారని తెలిపారు. యాదవులంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నత్రజనితో ఆముదంలో అధిక దిగుబడి

బేస్తవారిపేట: ఎండ తీవ్రత పెరిగినప్పుడు ఆముదం పంటలో మగ పుష్పాలు ఎక్కువగా ఏర్పడి దిగుబడి తగ్గిపోతుందని గిద్దలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు డీ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని పందిళ్లపల్లెలో పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. విత్తనం వేసిన 30–35 రోజులకు 6 కిలోల నత్రజని, 60–65 రోజులకు ఆరు కిలోల నత్రజని ఎరువులు చల్లుకోవడంతో మగ పూత శాతం తగ్గి, ఆడ పుష్పాలు ఎక్కువగా వస్తాయన్నారు. నీటి వసతి ఉన్న భూముల్లో ఆముదం పంట వేసిన 40–45 రోజులకు ఒక మొగ్గను ఉంచి మిగిలిన కొమ్మలను తుంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో జక్కం మెర్సీ, ఏఈవో, వీఏఏలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న పట్టణంలోని డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ పీవీ నాగేశ్వరరావు, డీఈ షీయానాయక్ సోమవారం తెలిపారు. రిటైర్డ్ సెషన్స్ జడ్జి ఎస్. విక్టర్ ఇమ్మానుయేల్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ నిర్వహిస్తామని, విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు.

మామపై అల్లుడి దాడి

మార్కాపురం: పాత కక్షలను మనసులో పెట్టుకొని మామపై అల్లుడు పదునైన ఆయుధంతో దాడి చేశాడు. ఈ సంఘటన సోమవారం మండలంలోని జమ్మనపల్లిలో జరిగినట్లు రూరల్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. గ్రామానికి చెందిన దాసరి పెద్ద అంకాలుపై అల్లుడు చిన్నఅంకాలు సోమవారం పదునైన ఆయుధంతో దాడి చేయడంతో తీవ్రం గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స కోసం ఒంగోలు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన బాలిక దర్శిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చింది. ముండ్లమూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం వరకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయల్దేరింది. ఆ తర్వాత సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లేకపోవడంతో సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు టీచర్ల నియామకం

పుల్లలచెరువు: మండలంలోని రెండు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఇద్దరు ఉపాధ్యాయులు నూతనంగా విధుల్లో చేరినట్లు ఎంఈఓ శామ్యూల్‌జాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుల్లలచెరువు జెడ్పీ స్కూల్లో గణిత ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, పీవీపల్లి జెడ్పీ స్కూల్లో ఇంగ్లిష్ టీచర్ కృపాదానాన్ని జిల్లా అధికారులు నియమించగా వారు విధుల్లో చేరారని ఎంఈఓ వివరించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

తాళ్లూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ కోరారు. స్థానిక వీకే జూనియర్ కళాశాలలో మంగళవారం 45వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సి.తారక్‌నాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కష్టపడి చదవాలని కోరారు. టెక్నాలజీని అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని, చెడు మార్గాల కోసం అన్వేషించవద్దన్నారు. చెడు మార్గంలో నడుస్తూ మత్తు పానీయాలు, డ్రగ్స్ వంటి వాటికి అలవాడు పడితే జీవితం అంధకారం అవుతుందని, సమాజంలో తల్లిదండ్రులు, బంధువులకు కూడా తల ఒంపులు వస్తాయన్నారు. ప్రిన్సిపాల్ తారక్‌నాథ్ మాట్లాడుతూ కళాశాలలో ప్రభుత్వం నాడు–నేడుతో అనేక సౌకర్యాలు సమకూర్చుతోందని, విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే వారిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్ తరాల విద్యార్థులు ఎక్కువ మంది చేరేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలో ఉత్తమ మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. లెక్చరర్స్ అంకిత భావంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న విధానాన్ని వివరించారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ప్రతిభ చాటిన విద్యార్థులు, పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వీకే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజయ్‌బాబు, ఆచార్యులు పాండురంగరాజు, శ్రీధర్, గురవయ్య, పార్వతీబాయ్, నరసింహారావు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు


పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులతో ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

● ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

పెద్దదోర్నాల: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి ఆకాంక్షించారు. సోమవారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యాభ్యాసం చేయాలన్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన జట్లకు సర్టిఫికెట్లు, కప్‌లు బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సామ్యేల్ జోబ్, రాజేంద్ర, చిట్టిబాబు, నాగేశ్వారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా

సింగరాయకొండ: జాతీయ రహదారిపై పరిమితికి మించి వేగంగా వెళ్తున్న 100 వాహనాలకు సోమవారం జరిమానా విధించినట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. మండలంలోని పెరల్ డిస్టిలరీ వద్ద స్పీడ్ గన్ ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని అంచనా వేశామని, హద్దు మీరి ప్రయాణించిన ఒక్కో వాహనానికి రూ.400 చొప్పున మొత్తం రూ.40 వేలు జరిమానా విధించామని ఎస్సై వివరించారు. ఆమె వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుడ్లూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చినలాటరఫి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నరసాపురం ప్రాథమిక పాఠశాలలో రైతన్న ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. మానవ మనుగడకు ప్రాణాధారమైన మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఫౌండేషన్ చైర్మన్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నటరాజ అలంకారంలో స్వామివారు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పొదిలి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా పొదిలిలో జరుగుతున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు గురువారం చంద్ర వాహనంపై నటరాజ అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరిని ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి పొదిలి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలు యాదాల వెంకటేశ్వర్లు, మంచికంటి సుధీర్‌కుమార్, సునీల్‌కుమార్, టంగుటూరి సూర్యనారాయణ, చంద్రపాటి వెంకట సీతారామాంజనేయప్రసాద్‌లు ప్రత్యేక పూజలు చేసి తమ మెక్కులు తీర్చుకున్నారు. అనంతరం నైవేద్యాలు చెల్లించి తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

60 మందికి కంటి పరీక్షలు

హనుమంతునిపాడు: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7, 8 తరగతుల విద్యార్థులు 60 మందికి నేత్ర పరీక్షలు చేశారు. పరీక్షల్లో ఆరుగురికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి వైద్యులు తెలిపారు. హెచ్‌ఎం జీవీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

మినుముల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వలేటివారిపాలెం: మినుముల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. మండలంలో రైతులు ఈ రబీ సీజన్లో సాగు చేసిన మినుములను ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులంతా సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం క్వింటాకు రూ.6,600 మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందన్నారు.

200 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కొమరోలు: స్థానిక శ్రీనివాస ప్రజావైద్యశాల వద్ద సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాలలోని శాంతిరామ్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల వాసవీ క్లబ్ ప్రెసిడెంట్, మండల మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలేపల్లి మోహనరంగస్వామి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటి సమస్యలున్న 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉండి ఆపరేషన్ అవసరం ఉన్న 12 మంది రోగులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడానికి నంద్యాల తీసుకెళ్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఆది, కేశవ్, మూర్తి పాల్గొన్నారు.

20లోగా ఈ-క్రాప్ నమోదు చేయాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ వెంకటేష్

మద్దిపాడు: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ నెల 20వ తేదీలోగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని గంగపాలెం గ్రామంలో వరి పైరును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ కూడా చేయించుకోవాలని చెప్పారు. ఈ క్రాప్‌లో నమోదైన రైతులకు మాత్రమే నష్టపరిహారం, సున్నావడ్డీ రుణాలు, మద్దతు ధర వర్తిస్తాయని స్పష్టం చేశారు. పీఎం కిసాన్ పథకం నగదు జమ కావాలంటే మీసేవ లేదా సీఎస్‌సీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చందన

మార్కాపురం: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బంది ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున్న నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ చందన ఆదేశించారు. సోమవారం ఆమె కోలభీమునిపాడు, జమ్మనపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించి చక్కగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్లాట్‌ఫాంపై వ్యర్థాలు వేరు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నాయకుల విగ్రహాలు ఉంటే కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను దృష్టిలో పెట్టుకొని వాటికి ముసుగు వేయాలన్నారు.

క్రీడలతో మానసిక వికాసం


క్రీడా జ్యోతి వద్ద సీఐ భీమానాయక్

మార్కాపురం: క్రీడలతో విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం వస్తుందని సీఐ భీమానాయక్ అన్నారు. సోమవారం భాష్యం స్కూల్లో జోనల్ స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడ జ్యోతి వెలిగించారు. చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విజేతలకు జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ కేవీ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి హేమసుధ పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు వృద్ధులకు వరం

తాళ్లూరు: వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద శుక్లాల ఆపరేషన్‌కు 38 మంది వృద్ధులను పెదకాకాని శంకర వైద్యశాలకు బస్సులో తరలించారు. టెక్నీషియన్ ఉమ తదితరులు వృద్ధులను బస్సు ఎక్కించి తగిన జాగ్రత్తలు చెప్పి శుక్లాల ఆపరేషన్‌కు పంపారు.

సర్పంచ్ సొంత నిధులతో డీప్ బోర్


తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన డీప్ బోరు

త్రిపురాంతకం: మండలంలోని సంఘం తండా ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సర్పంచ్ ఆర్.హనిమీబాయి సక్రునాయక్ తన సొంత నిధులతో డీప్ బోరు ఏర్పాటు చేయించారు. డీప్ బోరు ఏర్పాటుకు లక్ష రూపాయలు వెచ్చించినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజానాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలాజీనాయక్, వైఎస్సార్ సీపీ నాయకుడు బాలునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

త్రిపురాంతకం: మండలంలోని కంకణాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 9, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, నోట్‌బుక్స్ గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో వినియోగించేందుకు మైక్ సెట్‌ను ఎంఈఓ కె.తులసి మల్లికార్జుననాయక్, ప్రధానోపాధ్యాయుడు ఉడుముల శ్రీనివాసరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, వెంకటేష్‌తోపాటు మరో 15 మంది పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల విచారణ


విచారిస్తున్న వ్యవసాయాధికారులు

దొనకొండ: మండలంలోని చందవరంలో 2020–21లో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. ఆర్‌బీకే సిబ్బంది పొలం లేని వారి పేర్ల మీద ఈ–క్రాప్ చేసి త్రిపురాంతక మండలం వెల్లంపల్లి గ్రామ రైతుల నుంచి వరి కొనుగోలు చేసి సిబ్బంది మరి కొంతమంది చేతివాటంతో లక్షలు మింగేశారని ఆరోపణలు వచ్చాయి. గ్రామ మాజీ సర్పంచ్ నూనె రవికుమార్ జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో వ్యవసాయ శాఖ విచారించి ఆర్‌బీకే సిబ్బందిపై చర్యలు తీసుకుంది. స్థానిక ఆర్‌బీకేలో జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లా భూ రక్షణ విభాగం అధికారి సుబ్రహ్మణేశ్వరరావు, జిల్లా వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ బి.ఎఫ్రాయిమ్, దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు పి.నిర్మలాదేవి సమక్షంలో సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడైన రవికుమార్‌ను, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ గుమ్మా వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, వరి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి దగ్గుల వెంకటేశ్వరరెడ్డిని, మండల వ్యవసాయాధికారులను విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. నివేదికను జిల్లా వ్యవసాయ అధికారులకు అందజేస్తామని తెలిపారు. వారి వెంట వ్యవసాయాధికారి ఎన్. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జాస్మిన్

ముండ్లమూరు: విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులు జ్యోతి, జాస్మిన్ సూచించారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మంచులో తిరగరాదన్నారు. జలుబు, దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. ఒక విద్యార్థినికి రేచీకటి ఉన్నట్లు గుర్తించి రిమ్స్‌కు రిఫర్ చేశారు. ప్రిన్సిపాల్ ఆవుల సునీత పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ


తోపుడు బండ్లు అందజేస్తున్న కమిషనర్, రోటరీ క్లబ్ ప్రతినిధులు

దర్శి: రోటరీ క్లబ్ దర్శి ఆధ్వర్యంలో సోమవారం చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు చేతుల మీదుగా వ్యాపారులకు రూ.12 వేల విలువైన ఎనిమిది మంది చిరు వ్యాపారులకు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మహేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ దర్శి సేవా గుణంతో ముందుకొచ్చి చిరు వ్యాపారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ దర్శి అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి నలుగురికి, సెక్రటరీ రెడ్డిమాసు శ్రీనివాసరావు ముగ్గురికి, పాలకొలను రవీంద్రరెడ్డి ఒకరికి తోపుడు బండ్లకు సహాయం చేశారు.కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి కర్ణా భాస్కరరెడ్డి, సభ్యులు డాక్టర్ బాషా, డాక్టర్ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, లక్ష్మీనారాయణ, పానుగంటి కోటేశ్వరరావు, పేరిరెడ్డి, నారాయణరెడ్డి, రాజారెడ్డి, మార్తుల భాస్కర్, శివకోటిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి


వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: మండలంలోని వేములకోట ఇలాఖాలో సర్వే నంబర్ 414/1లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, ఆక్రమణదారులను తొలగించి గ్రామంలో అర్హులైన పేదలకు జగనన్న హౌసింగ్ కాలనీ–2లో ఇంటి పట్టాలు ఇప్పించాలని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు జంకె వెంకటనారాయణరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరయ్య, మాజీ ఎంపీటీసీ చాగంటీటి వెంకటనారాయణరెడ్డి, జంకె మోహన్‌రెడ్డి, హనుమయ్య, కోటిరెడ్డిలు సోమవారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందించారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి విచారణ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. అంకిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, యాకోబ్, అలూర్‌రెడ్డి, పుల్లయ్య, పెద్ద గురవయ్య, లక్ష్మిరెడ్డి, ఆవులయ్య తదితరులు అర్జీ ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఒంగోలు రోడ్డుకు మరమ్మతులు చేయాలి

మార్కాపురం నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే రహదారి గుంతలు పడి ఇబ్బందిగా ఉందని, మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, చెన్నయ్య, శ్రీధర్, ఆదిలక్ష్మి తదితరులు వినతిపత్రం ఇచ్చారు. రోడ్డును వెడల్పు చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ల జాబితాను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం ప్రకటించారు. నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఒద్దుల లక్ష్మీరెడ్డి(పెద్దారవీడు), కో–కన్వీనర్లుగా షేక్.కాశింబాష(యర్రగొండపాలెం), నెమలిపూడి నాగరాజు (పుల్లలచెరువు), మొగల్ న్యామతుల్లా బేగ్(పెద్దదోర్నాల), మాలపోలు శ్యాం(త్రిపురాంతకం), సాంఠి నాగార్జునరెడ్డి (పెద్దారవీడు)ని నియమించారు. మండల సోషల్ మీడియా కన్వీనర్ల పేర్లను త్వరలో ప్రకటిస్తామని మంత్రి తెలిపారు.